నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 15 సెప్టెంబర్ 2024 | SANGAREDDY

సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ప్రైవేట్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎర్రకుంట చెరువులో చేపట్టిన నిర్మాణాలు

టీచర్ల కృషితోనే ప్రథమస్థానం

సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ట్రెస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, హాజరైన ఉపాధ్యాయులు

- టీచర్ల కృషితో సిద్దిపేట జిల్లాకు మంచి ర్యాంకులు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయుల విషయంలో వివక్ష చూపడం సీఎం రేవంత్‌కు తగదు
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వానికి రెండు కండ్లు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ట్రెస్మా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉపాధ్యాయుల కృషి కారణంగా కొన్నేండ్లుగా పదో తరగతి ఫలితాల్లో సిద్దిపేట జిల్లా మంచి ఫలితాలు సాధిస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు.శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ కన్వెన్షన్ హాల్ ట్రెస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ఉద్దేశించి హరీశ్‌రావు మాట్లాడుతూ... ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల మధ్య తేడాచూపుతూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు దురదృష్టకరం అన్నారు. ఉపాధ్యాయుల విషయంలో సీఎంకు తేడా తగదని, ప్రభుత్వ ఉపాధ్యాయులతో ప్రైవేట్ టీచర్లను పోలుస్తూ తక్కువ చేసి మాట్లాడడం తగదన్నారు. ప్రైవేట్ టీచర్లకు వేతనాలు తక్కువ ఉండవచ్చు కానీ, సామర్థ్యం విషయంలో ప్రైవేటు టీచర్లు ప్రభుత్వ టీచర్లకు తక్కువేమి కాదన్నారు. ఒకరిని మెచ్చుకునే క్రమంలో ఇంకొకరిని కించపరిచే వ్యాఖ్యలు సీఎం స్థాయి మనిషికి తగవన్నారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రైవేట్ పాఠశాలల్లోనే ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్ విద్యావ్యవస్థ తెలంగాణలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలపై చిన్నచూపు తగదని.. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ రెండు కండ్లు అన్నారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నట్లు హరీశ్‌రావు విమర్శించారు. 10 నెలలుగా నిధులు రావడం లేదన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు సొంతంగా తాను ఉచిత బీమా సౌకర్యం కల్పించి ఈ జిల్లా గౌరవం పెంచానన్నారు. ఈ ఏడాది కూడా రూ.5 లక్షల ఉచిత బీమా పథకం అందిస్తానన్నారు. పిల్లలకు మంచి చదువు అందించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు వెనుకడుగు వేయడం లేదన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీసి వారిని మంచి పౌరులుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధికి కృషిచేస్తానని, ప్రైవేట్ స్కూల్స్, ప్రైవేట్ టీచర్లకు అన్నివేళలా అండగా ఉంటానని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ట్రెస్మా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

రోజురోజుకూ కుచించుకుపోతున్న చెరువులు, కుంటలు

- ఆక్రమణలను అరికట్టాల్సిన అధికారులే అండగా నిలుస్తున్నారు..
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ కట్టడాలు
- సిద్దిపేట కోమటిచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం
- సంగారెడ్డి జిల్లాలో ఇష్టారీతిగా చెరువులు, కుంటల కబ్జా
- పటాన్‌చెరువులోని సాకి చెరువు నేడు కనుమరుగయ్యే పరిస్థితి
- సంగారెడ్డి జిల్లాకేంద్రంలో పూర్తిగా కుచించుకుపోయిన ఎర్రకుంట
- రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం

సిద్దిపేటలోని కోమటి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మించిన కాంగ్రెస్ క్యాంపు కార్యాలయం

సిద్దిపేట, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు రోజు రోజుకూ కుచించుకుపోతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువులు, కుంటలతోపాటు ఇతర ప్రభుత్వ భూములు ఎక్కడ ఖాళీ కనిపిస్తే చాలు ఇట్టే కబ్జాలు చేసేస్తున్నారు. నీటి ప్రవాహానికి అడ్డుగా అక్రమ నిర్మాణాలు చేయడంతో చెరువుల పరిధి పూర్తిగా తగ్గిపోయింది. ఫలితంగా చిన్నపాటి వర్షాలకు నీరంతా ఇండ్లను ముంచెత్తుతున్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోకి ఆక్రమణదారులు చొచ్చుకొచ్చి మరీ కబ్జాలు చేస్తున్నారు. దీనిని అరికట్టాల్సిన అధికారులే పూర్తిగా వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. చెరువుల పర్యవేక్షణలో ప్రధానంగా మూడు శాఖల ప్రమేయం ఉంటుంది. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలు కలిసి పనిచేస్తేనే చెరువుల ఆక్రమణలను అరికట్టవచ్చు. వీటిలో ఏ ఒక్క శాఖ సహకరించకపోయినా చెరువుల ఆక్రమణలు మరింతగా పెరిగే అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ ఉమ్మడి మెదక్ జిల్లా లో ఇటీవల రెవెన్యూ,నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అధికారుల అండదండలతో రియల్టర్లు చెరువుల్లోనే వెంచర్లు ఏర్పాటు చేశారు. అక్రమార్జనే ధ్యేయంగా రియల్టర్లు వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో జిల్లాలోని పలు మండల కేంద్రాలతోపాటు, మున్సిపాలిటీల్లోనూ మేజర్ గ్రామాల్లో చెరువులు, విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. స్థానిక అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొంతమంది బడా నేతలు కలిసి బఫర్ జోన్‌లోనే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ చేపట్టారు. ఆ సమయంలో అన్ని చెరువులకు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లను నిర్ధారించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ హద్దులను యథేచ్ఛగా మార్చేసి, ఇష్టారీతిగా ఆక్రమిస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో మచ్చుకు కొన్ని కబ్జాలు

సిద్దిపేట, మెదక్ , సంగారెడ్డి జిల్లాల్లోని పలు చెరువులు స్వరూపాన్ని కోల్పోతున్నాయి. రికార్డులకు అక్కడ ఉన్న పరిస్థితులకు పొంతన లేకుండా ఉన్నది. రానురాను కుంటలను పూర్తిగా మాయం చేస్తున్నారు. ఇష్టారీతిగా కబ్జాలు చేయడంతో చెరువులు, కుంటలు ఆనవాలు లేకుండా పోతున్నాయి. సిద్దిపేట జిల్లా హెచ్‌ఎండీఏ పరిధిలో జిల్లాలో 277 చెరువుల ఎఫ్‌టీఎల్‌ను గుర్తించాలని ఇదివరకే ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం అధికారులు అదే పనిలో ఉన్నారు. జిల్లాలో ప్రధానంగా కొన్నింటిని చూస్తే సిద్దిపేట కోమటి చెరువు ఎఫ్‌టీఎల్ , బఫర్‌జోన్ పరిధిలోనే అక్రమ కట్టడాలు వెలిశాయి. హద్దులను ఏకంగా తొలిగించారు. ఏకంగా అధికార కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోనే నిర్మించారు. మరికొన్ని ఫాంహౌస్‌ల నిర్మాణాలతోపాటు అనేక కట్టడాలు వెలిశాయి. పట్టణంలోని కొన్ని కుంటలను యథేచ్ఛగా కబ్జాలు చేసి ప్లాట్లు చేసి విక్రయించారన్న ఫిర్యాదులు ఉన్నాయి. సిద్దిపేట పట్టణం చుట్టూ పదుల సంఖ్యలో చెరువులు, కుంటలు ఉండేవి. అవి రానురాను పూర్తిగా కుచించుకుపోయాయి. దీనిని అరికట్టాల్సిన రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇదేంటి అని అడిగితే తాము ఇటీవలే బదిలీపై వచ్చాం. తమకు ఏం తెలియదు అన్నట్లుగా అధికారులు వ్యవహరించడం కోసమెరుపు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగి అధికారులు ఇలా మాట్లాడుతున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల ప్రాంతంలో పలు చెరువులు పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. చేర్యాల ప్రాంతంలోని కుడి చెరువు పూర్తిగా ఆక్రమణదారుల చేతిలోకి వెళ్లింది. చేర్యాల మండలం నాగపురి–జగదేవ్‌పూర్ మండలం తిగుల్ నర్సాపూర్ గ్రామాల సరిహద్దులో ఉన్న నల్లపోచమ్మ చెరువులో ఆక్రమ కట్టడాలు వెలిశాయి. ఈ తంతు కొనేండ్లుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతంలో పాండవుల చెరువు ఫీడర్ ఛానల్ పూర్తిగా కుచించుకుపోయింది. ఇలా పట్టణంలోని పలు చెరువులు, కుంటల పరిస్థితి ఇంతే. దుబ్బాక, హుస్నాబాద్ ప్రాంతాల్లో చెరువులు కుంటల పరిస్థితి ఇలానే ఉంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోనే పెద్దపెద్ద నిర్మాణాలు జరిగాయి. మెదక్ జిల్లాలోని పలు చెరువులు కుంటలు పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. మెదక్ పట్టణంలోని మల్లెంల చెరువు పూర్తిగా అక్రమణదారుల చేతుల్లోకి పోయింది. ఇష్టారీతిగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. నర్సాపూర్‌లోని రాయరావు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. రాయంపేట, తుప్రాన్, చేగుంట తదితర ప్రాంతాల్లో చాలావరకు కుంటలు కనుమరుగయ్యాయి.

దుద్దెడలో అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నం వడ్డిస్తున్న హరీశ్‌రావు

భక్తులకు అన్నం వడ్డించిన హరీశ్‌రావు

కొండపాక(కుకునూరుపల్లి),సెప్టెంబర్ 14: కొండపాక మండలంలోని దుద్దెడలో రుద్ర పవర్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరయ్యారు. గణపతి వద్ద పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమంలో భాగంగా భక్తులకు భోజనం వడ్డించారు. అనంతరం యువజన సంఘం సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ మిద్దె శంబయ్య, నాయకులు గుండెల్లి ఆంజనేయులు, చిక్కుడు భాను, రుద్ర పవర్ ఫ్రెండ్స్ యూత్ అసోషియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి హాజరైన హరీశ్‌రావుకు చిన్నారులు పువ్వులు అందించి రండి సార్...గణపతి దగ్గరికి అంటూ స్వాగతం పలికారు. దీంతో హరీశ్‌రావు చిన్నారులు ఇచ్చిన పువ్వును తీసుకొని థాంక్యూ అంటూ పలకరించి కరచాలనం చేసి చిన్నారులతో సరదాగా ముచ్చటించారు.

నత్తనడకన ఎంపీడీవో భవన నిర్మాణం

- రూ. కోటి మంజూరు చేసిన బీఆర్ఎస్ సర్కార్
- ఏడాదిగా సాగుతున్న పనులు

నిర్మాణంలో ఉన్న సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల ప్రజా పరిషత్ భవనం

సదాశివపేట, సెప్టెంబర్ 14: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల ప్రజాపరిషత్ భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఎంపీడీవో భవనం పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఏడాదిగా నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. 2023 ఏప్రిల్ 6న అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, అప్పటి హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ రూ. కోటి నిధులతో ఎంపీడీవో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో బీఆర్ఎస్ సర్కార్ నిధులు మంజూరు చేసింది. దీంతో శిథిలావస్థకు చేరిన పురాతన ఎంపీడీవో భవనాన్ని పూర్తిగా డిస్‌మెంటల్ చేసి నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం పిల్లర్లు వేసి స్లాబు వేశారు. ఏడాదిగా నిర్మాణ పనులు పూర్తికాక పోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం రెండు చిన్న గదులలో ఎంపీడీవో కార్యాలయం కొనసాగుతున్నది. కార్యాలయం చిన్నదిగా ఉండడంతో కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు, ఆఫీస్‌కు వచ్చే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దడపుట్టిస్తున్న శునకాలు

కంట్రి, సెప్టెంబర్ 14: గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మండలంలోని ప్రతిగ్రామంలో పదుల సంఖ్యలో శునకాలు గుంపులుగా తిరుగుతుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వీధుల్లో ప్రజలు నడవడానికి పిల్లలు, వృద్ధులు జంకుతున్నారు. కంట్రి, తడ్కల్ పట్టణాల్లో కుక్కలు మెయిన్‌రోడ్డు గుండా కవాతు చేయడంతో వాహనచోదకులు వణుకుతున్నారు. ద్విచక్ర వాహనాల వెంబడిపడి కరుస్తున్నాయి. గ్రామాల్లో వందల సంఖ్యలో కుక్కలు పెరిగినా దాడులకు పాల్పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ఆదివారం కంట్రిలో కంతి సుదర్శన్ అనే వ్యక్తిపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. కుక్కల సమస్యలపై ఎంపీవో సుభాష్ స్పందించారు. కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది వాస్తమేనని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.

తడ్కల్‌లో మెయిన్‌రోడ్డుపై తిరుగుతున్న కుక్కలు

సంగారెడ్డి జిల్లాలో ఇష్టారీతిగా కబ్జాలు

సంగారెడ్డి జిల్లాలో చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇష్టారీతిగా వెంచర్లు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ చెరువులు, కుంటలను కబ్జా చేశారు. అక్రమాలను సరిచేయాల్సిన అధికారులే చేతులు చాచి అందినకాడికి పుచ్చుకొని ఇష్టారీతిగా అనుమతులు ఇచ్చారు. దీంతో కబ్జాలకు అడ్డు, అదుపు లేకుండా పోయింది. జిల్లాస్థాయి అధికారులు మొదులకొని, కిందిస్థాయి అధికారుల వరకు చేతులు మారాయి. అటు అధికారుల అండదండలు, ఇటు నాయకులు, రియల్టర్లు కలిశారు. అందినకాడికి కబ్జాలకు పాల్పడ్డారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో పలు కాలనీలు నీట మునుగుతుండడంతో అసలు రంగు బయట పడుతుంది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎర్రకుంట పూర్తిగా కుచించుకుపోవడంతో ఇటీవల ఆ కాలనీలు నీట మునిగాయి. చెరువు కట్ట తూము, ధ్వంసం చేయడంతోపాటు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాట్లు విక్రయించారు. ప్లాట్లు కొనుగోలు చేసినవారు బోరున విలపిస్తున్నారు. పటాన్‌చెరు నడిబొడ్డున ఉన్న సాకి చెరువు నేడు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. సుమారుగా 135 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు రానురాను ఆక్రమణలతో చిన్న కుంటగా మారింది. ఇప్పటికే అక్రమార్కులు తూములను మూసి భవనాలను నిర్మించారు. సాకి చెరువు మధ్య నుంచే రోడ్డు వేశారు. సాకి చెరువు వద్ద అక్రమంగా నిర్మాణాలు జరిగినట్లు స్థానిక రెవెన్యూ అధికారులు గుర్తించారు. అక్రమంగా వెలిసిన కట్టడాలను కూల్చివేయాలని గతంలోనే జీహెచ్‌ఎంసీకి నివేదించారు. ఐనప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. పటాన్‌చెరులోనే పలు చెరువులు కబ్జాలకు గురైనట్లు సమాచారం. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆయా పట్టణాల్లోని మేజర్ గ్రామ పంచాయతీల్లో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల కబ్జాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- సిద్దిపేట జిల్లా కొండపాకలో 100 పడకలతో సంజీవని దవాఖాన ప్రారంభించుకోవడం సంతోషకరం
- గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత వైద్యం
- సద్గురు మాధుసూదన్ సాయి
- కేవీ రమణాచారి, ట్రస్ట్ సభ్యులతో కలిసి పూర్తిస్థాయి వైద్యసేవలు ప్రారంభం
- సీఎం, మంత్రులు రాకపోవడం నిరుత్సాహ పరిచింది : కేవీ రమణాచారి



సిద్దిపేట జిల్లా కొండపాకలో పూర్తిస్థాయి సేవలను ప్రారంభిస్తున్న సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న సద్గురు మాధుసూదన్ సాయి, ట్రస్ట్ సభ్యులు

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 14 : జీవితంలో డబ్బే పరమావధిగా కాకుండా ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సద్గురు మాధుసూదన్ సాయి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో 2022 నవంబర్ 18న చిన్నారులకు ఉచిత వైద్యం కోసం నాటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించిన దవాఖానలో శనివారం పూర్తిస్థాయి వైద్య సేవలను సద్గురు మాధుసూదన్ సాయి, ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి, ట్రస్ట్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సద్గురు మాధుసూదన్ సాయి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కేవీ రమణాచారి సంపూర్ణ సహకారంతో కొండపాకలో సత్యసాయి జూనియర్ కళాశాలతో పాటు చిన్నారుల గుండె సంబంధిత వ్యాధులను నయం చేసేందుకు దవాఖానతో పాటు రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ విద్యాలయం, వైద్యాలయం రెండూ ఏర్పాటు చేసేందుకు అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఎంతో కృషి చేశారని, ఆయన అందించిన సహకారంతో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొండపాకలో ఇంత పెద్ద దవాఖానను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని, పేదలు వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలకు సేవ అందించడమే నిజమైన ప్రేమ అని సత్యసాయిబాబా తన పుస్తకంలో రాసుకున్నారని గుర్తు చేశారు. వైద్యరంగం ఇంత అభివృద్ధి చెందినా చిన్నపిల్లలు గుండె జబ్బులతో చనిపోవడం బాధాకరమని, వారిని కాపాడటమే సత్యసాయి ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ పాంతాల్లోని ఆడపిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నామని, కొండపాకలో ఏర్పాటు చేసిన సత్యసాయి జూనియర్ కళాశాలలో చదువుకొని ఉన్నత విద్యకు వెళ్లి ఎంతోమంది విద్యార్థినులు ప్రస్తుతం మంచి ఉద్యోగాలను సాధించి ఆదర్శంగా నిలిచినట్లు చెప్పారు. కొండపాకలో నర్సింగ్, పారామెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని, త్వరలోనే సత్యసాయి ట్రస్ట్ ద్వారా వర్సిటీని స్థాపిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే 25వేల మంది విద్యార్థులకు ప్రస్తుతం అన్నపూర్ణ సేవా ద్వారా రాగి జావ అందిస్తున్నట్లు తెలిపారు. వృద్ధాశ్రమ నిలయం, దేవాలయం, విద్యాలయం, వైద్యాలయాలతో మమేకమై దేవాలయంగా ఈ ప్రాంతం మారిందన్నారు. సామాజిక సేవే భగవత్ సేవగా ప్రజలు భావించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సద్గురు మధుసూదన సాయి పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సద్గురు మాధుసూదన్ సాయి

గొప్ప సేవలందిస్తున్న మధుసూదన్ సాయి

ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి

దైవం మానుష రూపేనా అన్నట్టుగా సద్గురు మధుసూదన్ సాయి సేవలు అందిస్తున్నారని ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. సత్యసాయి ట్రస్ట్ ద్వారా పేదలకు ఉచిత వైద్య అందించడానికి కొండపాకలోని ఆనంద నిలయం వద్ద దవాఖాన, రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయడం సంతోషాన్ని కలిగించిదన్నారు. ఇంత గొప్ప కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు వస్తారని ఆశించామని, ఎవరూ రాకపోవడం నిరుత్సాహం కలిగించిందని రమణాచారి పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, టీపీసీసీ ఇంటలెక్షన్ కమిటీ చైర్మన్ అనంతుల శ్యామోహన్, సత్యసాయి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ ప్రతినిధులు కొండల్‌రావు, మోహన్‌రెడ్డి, జగన్నాథశర్మ, రాజన్, ఉదయ్ పిలాని, శరత్‌చౌదరి, రవి వండ్లమని, ప్రవీణ్, దీక్షిత, సుబ్రహణ్యం, అపర్ణ, శివప్రసాద్, వరలక్ష్మి, రవికిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో ఏడేండ్ల చిన్నారి మృతి

సహస్ర (ఫైల్)

నర్సాపూర్,సెప్టెంబర్14: మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలో డెంగ్యూతో ఏడేండ్ల చిన్నారి శనివారం మృతి చెందింది. నర్సాపూర్ మున్సిపాలిటీ శివాలయం సమీపంలో నివసిస్తున్న జింకల నర్సింగ్, లహరి దంపతులకు ఏడేండ్ల బాలిక సహస్ర సంతానం. ఆ చిన్నారి నర్సాపూర్‌లోని డాన్‌బాస్కో ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నది. మూడు రోజులుగా జ్వరంతో అనారోగ్యానికి గురికావడంతో నర్సాపూర్ దవాఖానలో వైద్యం అందించారు. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లిన చిన్నారి సహస్ర అక్కడ సొమ్మసిల్లి పడిపోయింది. హుటాహుటిన హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ విషమించి చనిపోయింది. ప్లేట్‌లెట్స్ పడిపోయి డెంగ్యూతో మరణించిందని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు.

విషజ్వరంతో బాలిక మృతి

హుస్నాబాద్‌లో మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించిన మంత్రి పొన్నం

హుస్నాబాద్, సెప్టెంబర్ 14: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన మైదంశెట్టి నక్షత్రహాసిని(13) శనివారం విషజ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొద్ది రోజులుగా నక్షత్రహాసిని జ్వరంతో బాధపడుతోంది. స్థానికంగా వైద్యం చేయించినా తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్సలు చేయిస్తున్న క్రమంలోనే బాలిక మృత్యువాత పడింది. మనవరాలిని కోల్పోయిన కాంగ్రెస్ నాయకుడు మైదంశెట్టి వీరన్నతోపాటు బాలిక కుటుంబ సభ్యులను రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సాయంత్రం పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. నక్షత్రహాసిని మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. బాలిక మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

హుస్నాబాద్‌లో బాలిక మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం(ఇన్‌సెట్‌లో) నక్షత్ర హాసిని(ఫైల్)